22-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు మొత్తం కల్పమంతటిలోనూ ఆల్రౌండ్ పాత్రను అభినయించారు, ఇప్పుడు పాత్ర పూర్తయ్యింది, ఇక ఇంటికి వెళ్ళాలి"

ప్రశ్న:- పిల్లలైన మీరు మీ భాగ్యం యొక్క మహిమను ఏ పదాలతో చేస్తారు?

జవాబు:- బ్రాహ్మణులమైన మేము పిలక వంటి వారము. మమ్మల్ని నిరాకారుడైన భగవంతుడు కూర్చుని చదివిస్తున్నారు. ప్రపంచములో మనుష్యులు, మనుష్యులను చదివిస్తారు కానీ మమ్మల్ని స్వయంగా భగవంతుడు చదివిస్తున్నారు కావున ఎంత భాగ్యశాలి అయినట్లు.

ప్రశ్న:- ఈ డ్రామాలో అందరికన్నా పెద్ద పొజిషన్ ఎవరిది?

జవాబు:- నిరాకారుడైన తండ్రిది, వారు ఆత్మలైన మీ అందరి తండ్రి. ఆత్మలన్నీ డ్రామా సూత్రములో బంధింపబడి ఉన్నాయి. అందరికన్నా పెద్ద పొజిషన్ తండ్రిది.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలను ఆత్మిక తండ్రి అడుగుతున్నారు - మధురాతి మధురమైన పిల్లలూ, మన ఇల్లు అయిన శాంతిధామం గుర్తుందా? మర్చిపోలేదు కదా? ఇప్పుడు 84 జన్మల చక్రం పూర్తయ్యింది, అది ఎలా పూర్తి అయింది అనేది కూడా మీరు అర్థం చేసుకున్నారు. సత్యయుగము నుండి మొదలుకుని కలియుగాంతము వరకూ ఇంకెవ్వరూ ఇలా అడగలేరు. మధురాతి మధురమైన, ప్రియమైన పిల్లలను బాబా అడుగుతున్నారు - ఇప్పుడిక ఇంటికి వెళ్ళాలి కదా? ఇంటికి వెళ్ళి మళ్ళీ సుఖధాములోకి రావాలి. ఇది సుఖధామమైతే కాదు. ఇది పాత ప్రపంచము, దుఃఖధామము. అవి శాంతిధామము, సుఖధామము. ఇప్పుడు ఈ దుఃఖము నుండి విముక్తులై ముక్తిధామములోకి వెళ్ళాలి. ముక్తిధామము లేక శాంతిధామము ఎదురుగా నిలబడినట్లుగా ఉంది. అది ఇల్లు. మళ్ళీ మీరు కొత్త విశ్వములోకి వస్తారు, అక్కడ పవిత్రత, సుఖ-శాంతులు కూడా ఉంటాయి. ఇదైతే అర్థం చేసుకున్నారు కదా, ఇదే గానం కూడా చేస్తూ ఉంటారు. తండ్రిని కూడా పిలుస్తారు - ఓ పతిత పావనా, ఈ పతిత ప్రపంచము నుండి మమ్మల్ని తీసుకువెళ్ళండి, ఇందులో చాలా దుఃఖాలున్నాయి, మమ్మల్ని సుఖములోకి తీసుకువెళ్ళండి అని. ఇది స్మృతిలోకి వస్తుంది. స్వర్గమునైతే అందరూ తలచుకుంటారు. శరీరాన్ని వదిలితే, స్వర్గస్థులయ్యారు, లెఫ్ట్ ఫర్ హెవెన్లీ అబోడ్ అని అంటారు. ఎవరు వెళ్ళారు? ఆత్మ. శరీరమైతే వెళ్ళదు. ఆత్మయే వెళ్తుంది. ఇప్పుడు పిల్లలైన మీకే శాంతిధామము, సుఖధామముల గురించి తెలుసు. ఇంకెవరికీ తెలియదు. పిల్లలైన మీ బుద్ధిలో శాంతిధామమేమిటి మరియు సుఖధామమేమిటి అనే జ్ఞానము ఉంది. మీరు సుఖధామములో ఉండేవారు, ఇప్పుడు మళ్ళీ దుఃఖధామములోకి వచ్చారు. క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు, సంవత్సరాలు గతించిపోయాయి. ఇప్పుడు 5000 సంవత్సరాలలో ఇంకా కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉంటాయి. తండ్రి పిల్లలకు స్మృతిని కలిగిస్తూ ఉంటారు. ఇది చాలా సహజమైన విషయము, ఇందులో తికమకపడే అవసరమే లేదు. ఆత్మ 84 జన్మలను ఎలా తీసుకుంటుంది, ఇది కూడా ఎవరికీ తెలియదు. లక్షల సంవత్సరాల విషయమైతే ఎవరికైనా గుర్తుండడం కూడా కష్టమే. ఇది కేవలం 5000 సంవత్సరాల విషయమే. వ్యాపారస్థులు కూడా స్వస్తికను తమ ఖాతా పుస్తకాలపై దిద్దుతారు, దానిని గణేశ్ అని అంటారు. గణేశ్ కు ఏనుగు తొండం చూపిస్తారు. మనుష్యులు ధనం ఖర్చు పెడతారు, చిత్రాలు మొదలైనవాటిని తయారుచేస్తారు, దానిని సమయాన్ని వ్యర్థము చేసుకోవడము అని అంటారు. మీలో ఎంతటి శక్తి ఉండేది. అది రోజురోజుకు తగ్గిపోతూ వచ్చింది. ఏ విధంగా మోటార్ నుండి పెట్రోల్ తగ్గుతూ ఉంటుంది కదా. ఇప్పుడైతే మీరు చాలా బలహీనముగా అయిపోయారు. 5000 సంవత్సరాల క్రితం భారత్ ఎలా ఉండేది, అపారమైన సుఖాలు ఉండేవి. ఎంత గొప్ప ధనము ఉండేది. ఈ రాజ్యాన్ని వారు ఎలా పొందారు? రాజయోగాన్ని నేర్చుకున్నారు. ఇందులో యుద్ధం మొదలైనవాటి విషయమేమీ లేదు. వీటిని జ్ఞానపు అస్త్ర-శస్త్రాలు అని అంటారు. అంతేకానీ స్థూలమైన వస్తువులేమీ లేవు. ఇవి జ్ఞానపు అస్త్ర-శస్త్రాలు. జ్ఞానము, విజ్ఞానము. స్మృతి మరియు జ్ఞానము యొక్క ఎంత అద్భుతమైన అస్త్ర-శస్త్రాలున్నాయి. మొత్తం విశ్వమంతటిపై మీరు రాజ్యం చేస్తారు. దేవతలను అహింసకులు అని అంటారు.

ఇప్పుడు పిల్లలైన మీకు మనుష్యుల నుండి దేవతలుగా అయ్యే శిక్షణ లభిస్తోంది. మేము ప్రతి 5000 సంవత్సరాల తర్వాత అనంతమైన తండ్రి నుండి ఈ అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటున్నాము అని మీకు తెలుసు. ఇది ఆత్మకు సంబంధించిన విషయము. ఇందులో స్థూలమైన యుద్ధము మొదలైనవాటి విషయమేదీ లేదు. ఆత్మ

పతితముగా అయ్యింది కావున తాను పావనంగా అయ్యేందుకు తండ్రిని పిలుస్తుంది. ఇప్పుడు తండ్రి అంటారు - మధురాతి మధురమైన పిల్లలూ, ఇప్పుడైతే ఇంటికి వెళ్ళాలి. ఇది జీవాత్మల ప్రపంచము. అది ఆత్మల ప్రపంచము. దానిని జీవాత్మల ప్రపంచము అని అనరు. మనం దూరదేశ నివాసులము అన్నది ఘడియ-ఘడియ స్మృతిలోకి తీసుకురావాలి. ఆత్మలైన మన ఇల్లు బ్రహ్మాండము. ఇది కూడా బుద్ధిలో ఉండాలి - మనము అక్కడ ఉంటాము, ఈ ఆకాశ తత్వానికి దూరంగా, సూర్యచంద్రాదులు కూడా ఉండని ఆ స్థానము యొక్క నివాసులము మనము, ఇక్కడకు పాత్రను అభినయించేందుకు వచ్చాము. 84 జన్మల పాత్రను అభినయిస్తారు. అందరూ అయితే 84 జన్మలను తీసుకోలేరు. మెల్లమెల్లగా పై నుండి దిగుతూ వస్తారు. మనం ఆల్రౌండర్. అన్ని పనులనూ చేసేవారిని ఆల్రౌండర్ అని అంటారు. మీరు కూడా ఆల్ రౌండర్లే. ఆది నుండి అంతిమం వరకూ మీ పాత్ర ఉంది. ఇప్పుడు ఇది ఈ చక్రము యొక్క అంతిమము, అయినా కూడా పై నుండి వస్తూ ఉంటారు. చాలామంది పిల్లలు ఇంకా మిగిలి ఉన్నారు, వారు పై నుండి వస్తూ ఉంటారు. వృద్ధి చెందుతూ ఉంటారు.

తండ్రి పిల్లలైన మీకు 'హం సో' అన్న పదము యొక్క అర్థాన్ని కూడా అర్థం చేయించారు. వారైతే ఆత్మయైన మనమే పరమాత్మ అని అంటారు, వారికి డ్రామా యొక్క ఆదిమధ్యాంతాల గురించి, దాని కాల పరిమితి మొదలైనవాటి గురించి ఏమీ తెలియదు. ఈ శరీరములో మీరు ఇప్పుడు బ్రాహ్మణులుగా ఉన్నారని మీకు తండ్రి అర్థం చేయించారు. ప్రజాపిత బ్రహ్మా ద్వారా శివబాబా మిమ్మల్ని దత్తత తీసుకున్నారు, చదివిస్తారు, ఇది గుర్తుండాలి కదా. తండ్రి మనల్ని చదివిస్తున్నారు. వారు ఉన్నతోన్నతుడైన భగవంతుడు. ఆత్మలందరూ ఈ డ్రామా యొక్క దారములో కూర్చబడి ఉన్నారు. ఇప్పుడు మీకు తెలుసు - మేము ప్రారంభములో దేవతలుగా ఉండేవారము, మళ్ళీ మేమే క్షత్రియ ధర్మములోకి వచ్చాము అనగా సూర్యవంశీయుల నుండి చంద్రవంశీయులలోకి వచ్చాము, ఇన్ని జన్మలను తీసుకున్నాము అని. ఇవన్నీ తెలిసి ఉండాలి. ఈ జ్ఞానము ఇంతకుముందు మీలో అసలు ఏమాత్రమూ ఉండేది కాదు. ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు, ఇది వర్ణాల పిల్లిమొగ్గలాట. ఇప్పుడు మళ్ళీ శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అయ్యారు, బ్రాహ్మణుల నుండి మళ్ళీ దేవతలుగా అవుతారు. విరాట రూపాన్ని చూపిస్తారు కదా. మనము ఏ విధముగా పై నుండి కిందకు దిగాము, మళ్ళీ బ్రాహ్మణ కులములోకి వచ్చాము, మళ్ళీ దైవీ రాజ్యవంశములోకి వచ్చాము అన్న జ్ఞానమంతా మీ బుద్ధిలో ఉంది. ఇప్పుడు బ్రాహ్మణులైన మీరు పిలక వంటివారు. పిలక అన్నింటికన్నా పైన ఉంటుంది. మీ అంతటి ఉన్నతమైన కులం వారిగా ఎవరు పిలవబడతారు. భగవంతుడైన తండ్రి వచ్చి మిమ్మల్ని చదివిస్తున్నారు. మీరు ఎంతటి భాగ్యశాలులు. మీ భాగ్యాన్ని ఎంతోకొంత మహిమ చేయండి. బయటైతే అంతా మనుష్యులు మనుష్యులను చదివిస్తారు. వీరైతే నిరాకారుడైన తండ్రి. ఈ తండ్రి కల్ప-కల్పమూ ఒకేసారి వచ్చి జ్ఞానాన్ని ఇస్తారు. చదువునైతే ప్రతి ఒక్కరూ చదువుతారు కదా. బ్యారిస్టర్ జ్ఞానాన్ని చదువుకొని బ్యారిస్టర్ అవుతారు. అక్కడంతా మనుష్యులు మనుష్యులను చదివిస్తూ వస్తారు. ఇప్పుడు ఇది భగవానువాచ. మనుష్యులనైతే ఎప్పుడూ భగవంతుడు అని అనలేరు. వారు నిరాకారుడు. వారు ఇక్కడకు వచ్చి పిల్లలైన మిమ్మల్ని చదివిస్తారు. చదువును సూక్ష్మవతనములోనూ, అలాగే మూలవతనములోనూ చదవవలసి ఉండదు. చదువు ఇక్కడే ఉంటుంది. ఇందులో తికమకపడే విషయమేదీ లేదు. స్కూల్లో విద్యార్థులు ఎప్పుడైనా మేము తికమకపడుతున్నాము, మాకు నిశ్చయం కలగడం లేదు అని అంటారా? వారు తమ చదువును చదువుకొని పదవిని పొందుతారు. ఈ లక్ష్మీ-నారాయణులు సత్యయుగ ఆదిలో విశ్వాధిపతులుగా ఎలా అయ్యారు? తప్పకుండా తండ్రి ద్వారానే అయ్యారు. తండ్రి అయితే సత్యాన్నే వినిపిస్తారు. భగవంతుడు ఏమైనా తప్పు చెప్తారా. ఇది చాలా పెద్ద పరీక్ష. ఈ సమయములో ఉన్నది ప్రజలపై ప్రజల రాజ్యము. రాజు, రాణులు లేరు. వారు సత్యయుగములో ఉండేవారు, ఇప్పుడు కలియుగాంతములో లేరు. దీనిని పంచాయతీ రాజ్యం అని అంటారు. గీతలో కౌరవులు మరియు పాండవులు అని వ్రాసారు. ఆత్మిక పండాలైతే మీరే కదా. అందరికీ ఆత్మిక ఇల్లు యొక్క దారిని తెలియజేస్తారు. అది ఆత్మలైన మీ ఆత్మిక ఇల్లు. ఆత్మ జన్మ తీసుకొని పాత్రను అభినయిస్తుంది. ఈ విషయాల గురించి మీకు తప్ప ఇంకెవరికీ తెలియదు. ఋషులు, మునులు మొదలైనవారెవరికీ రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి తెలియదు. లక్షల సంవత్సరాలు అని అనేస్తారు కానీ దానికి సంబంధించిన పూర్తి లెక్క కూడా లేదు, ఆ లెక్కలో సగం, సగం కూడా ఉండదు. పూర్తిగా సగం సుఖధామము, ఆ తర్వాత పూర్తిగా సగం దుఃఖధామము. ఇది వికారీ పతిత ప్రపంచము మరియు అది నిర్వికారీ ప్రపంచము.

తండ్రి ఎంత ఉన్నతోన్నతమైనవారు, కానీ వారు ఎంత సాధారణంగా ఉన్నారు. ఎవరైనా గొప్ప వ్యక్తులు, ఆఫీసర్లు మొదలైనవారిని కలిసినప్పుడు వారికి ఎంత గౌరవాన్ని ఇస్తారు. పతిత ప్రపంచములో పతిత మనుష్యులు పతితులనే

చూస్తారు. పావనులు గుప్తముగా ఉన్నారు. బయటి నుండి ఏమీ కనిపించదు. తండ్రిని నాలెడ్జ్ ఫుల్, బ్లిస్ ఫుల్ అని అంటారు. అన్ని విషయాలూ తండ్రిలో ఫుల్ గా ఉన్నాయి, అందుకే వారిని జ్ఞానసాగరుడు అని అంటారు. ప్రతి మనిషి పొజిషన్ యొక్క మహిమ వేర్వేరుగా ఉంటుంది. మంత్రిని మంత్రి అని, ప్రధానమంత్రిని ప్రధానమంత్రి అని అంటారు. వీరు ఉన్నతోన్నతమైన భగవంతుడు. అందరికన్నా పెద్ద పొజిషన్ నిరాకారుడైన తండ్రిది, వారికి మనమందరమూ పిల్లలము. అక్కడ మనమందరమూ తండ్రితో పాటు పరంధామములో ఉంటాము. అది ఇల్లు. ఇక్కడ ప్రతి ఒక్కరికీ తమ-తమ పాత్ర లభించి ఉంది. కొందరు ఒక్క జన్మ పాత్రను అభినయించి కూడా తిరిగి వెళ్ళిపోతారు. తండ్రి అర్థం చేయిస్తారు, ఇది మనుష్య సృష్టి యొక్క వెరైటీ వృక్షము. ఒకరి రూపురేఖలు ఇంకొకరితో కలవవు. ఆత్మలైతే ఒకేలా ఉంటాయి. ఇకపోతే శరీరాలు ఒకదానితో ఒకటి కలవవు. నాటకాలను కూడా చూపిస్తారు, అందులో ఒకే ముఖకవళికలు కలవారిని ఇద్దరిని తయారుచేస్తారు, అది చూసి తికమకపడతారు - నా పతి ఇతడా లేక అతడా? అని. ఇది అనంతమైన నాటకము. ఇందులో ఏ ఇద్దరూ ఒకేలా ఉండరు. ప్రతి ఒక్కరి రూపురేఖలూ వేర్వేరు. ఆయుష్షు ఒకే విధముగా ఉన్నా కానీ రూపురేఖలు ఒకే విధముగా ఉండవు. ప్రతి జన్మలోనూ రూపురేఖలు మారిపోతూ ఉంటాయి. ఇది ఎంత పెద్ద అనంతమైన నాటకము. కావున దీనిని తెలుసుకోవాలి కదా. మొత్తం సృష్టి యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానం మీ బుద్ధిలో ఉంది. ప్రతి ఒక్కరికీ డ్రామాలో ఏ పాత్ర అయితే ఉందో దానినే అభినయిస్తారు. డ్రామాలో ఎవరి స్థానాన్ని ఎవ్వరూ రీప్లేస్ చెయ్యలేరు. ఇది అనంతమైన డ్రామా కదా. ఇందులో జన్మలు తీసుకుంటూ ఉంటారు. అందరి రూపురేఖలూ వేర్వేరు. ఎన్ని వెరైటీ రూపురేఖలు ఉన్నాయి. ఈ జ్ఞానమంతా బుద్ధి ద్వారా అర్థం చేసుకోవలసినది. ఇందులో పుస్తకాలు మొదలైనవేవీ లేవు. గీతా భగవానుడు తన చేతిలో గీతను తీసుకొని వస్తారా ఏమిటి? వారు జ్ఞానసాగరుడు, వారేమైనా పుస్తకాన్ని తీసుకువచ్చారా. పుస్తకాలైతే భక్తి మార్గములో తయారవుతాయి. కావున ఇదంతా డ్రామాలో రచింపబడి ఉంది. ఒక క్షణము ఇంకొక క్షణముతో కలవదు. పిల్లలైన మీకైతే అంతా అర్థం చేయించారు. చక్రము పూర్తి అయి మళ్ళీ కొత్తగా ప్రారంభమవుతుంది. ఇప్పుడు మీరు చదువుతున్నారు. మీరు తండ్రిని కూడా తెలుసుకున్నారు. రచనను కూడా తెలుసుకున్నారు. మూలవతనము నుండి ఇక్కడకు పాత్రను అభినయించడానికి వస్తారు. ఈ స్టేజ్ ఎంత పెద్దది, దీనిని ఎవ్వరూ కొలవలేరు, దీని అంతాన్ని ఎవరూ చేరుకోలేరు. సాగరము మరియు ఆకాశము యొక్క అంతాన్ని ఎవరూ కొలవలేరు, అందుకే అంతములేనిది అని మహిమ చేయబడుతుంది. ఇంతకుముందు ఇంతగా ప్రయత్నించేవారు కాదు, ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. సైన్స్ కూడా ఇప్పుడు ఉంది, మళ్ళీ ఎప్పుడు ప్రారంభమవుతుంది? వారి పాత్ర వచ్చినప్పుడు ప్రారంభమవుతుంది. ఇన్ని విషయాలన్నీ శాస్త్రాలలో ఏమైనా ఉన్నాయా. వినిపించేవారికి బదులుగా వినేవారి పేరును వ్రాసేసారు. ఇది నల్లని ఆత్మ, అది తెల్లని ఆత్మ. నల్లని ఆత్మ వీరి ద్వారా విని తెల్లగా అయ్యింది. జ్ఞానముతో ఎంతటి ఉన్నతమైన పదవి లభిస్తుంది.

ఇది గీతా పాఠశాల. ఇక్కడ ఎవరు చదివిస్తారు? భగవంతుడు అమరపురి కొరకు రాజయోగాన్ని నేర్పిస్తారు, అందుకే దీనిని అమరకథ అని కూడా అంటారు. తప్పకుండా సంగమయుగములోనే వినిపించి ఉంటారు. ఎవరైతే కల్పపూర్వము చదువుకున్నారో వారే మళ్ళీ వచ్చి చదువుకుంటారు మరియు నంబరువారుగా పదవిని పొందుతారు. మీరు ఇక్కడకు ఎన్ని సార్లు వచ్చారు? లెక్కలేనన్ని సార్లు. ఈ నాటకం ఎప్పుడు ప్రారంభమయ్యింది అని ఎవరైనా అడిగితే, ఇది అనాదిగా నడుస్తూ వస్తోంది అని మీరు చెప్తారు. దీనిని ఎవరూ లెక్కించలేరు. అసలు ఈ విషయాన్ని అడిగే ఆలోచన కూడా రాదు.

శాస్త్రాలలో ఉన్నవన్నీ భక్తి మార్గపు కథలు, వాటిని చదువుతూ ఉంటారు. ఇక్కడైతే అనేక భాషలున్నాయి, సత్యయుగములో అనేక భాషలు మొదలైనవి ఉండవు. ఒకే ధర్మము, ఒకే భాష, ఒకే రాజ్యము యొక్క స్థాపనను మీరు చేస్తున్నారు. వారైతే శాంతిని స్థాపించేందుకు సలహాను ఇచ్చేవారికి ప్రైజ్ లు ఇస్తూ ఉంటారు. శివబాబా మీకు మొత్తం విశ్వములో శాంతిని స్థాపించేందుకు సలహాను ఇస్తారు. వారికి మీరు ఏ ప్రైజ్ ను ఇస్తారు? వారు స్వయమే మీకు ప్రైజ్ ఇస్తారు. వారు తీసుకోరు. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు. వీరి రాజ్యముండేది అన్నది నిన్నటి విషయమే. ఇప్పుడైతే ఉండేందుకు స్థానం లేదు. అక్కడైతే 2-3 అంతస్థులను నిర్మించవలసిన అవసరం కూడా ఉండదు. చెక్క మొదలైనవాటి అవసరం ఉండదు. అక్కడైతే బంగారము, వెండి యొక్క ఇళ్ళు ఉంటాయి. సైన్స్ వేగముతో వెంటనే ఇళ్ళు తయారవుతాయి. ఇక్కడైతే సైన్స్ వలన సుఖమూ ఉంది, దుఃఖమూ ఉంది. దీని ద్వారా మొత్తం ప్రపంచమంతా అంతమైపోతుంది, దీనిని ఫాల్ ఆఫ్ పాంపియా (ఆడంబరాలు తగ్గిపోవటము) అని అంటారు. మాయ షో ఎంతగా ఉంది. షావుకార్ల కొరకైతే ఇక్కడే స్వర్గమున్నట్లుగా ఉంది, అందుకే వారు మీ మాటను కూడా

వినరు. ఇంతకుముందు మీకు కూడా తెలిసేది కాదు. ఇక్కడైతే తండ్రి వచ్చి డైరెక్ట్ గా మిమ్మల్ని చదివిస్తారు. బయటైతే ఎంతైనా పిల్లలు చదివిస్తారు. మిత్ర-సంబంధీకులు మొదలైనవారు కూడా గుర్తుకువస్తూ ఉంటారు. ఇక్కడైతే తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. రోజురోజుకు మీరు స్మృతియాత్రలో పక్కా అవుతూ ఉంటారు. ఆ తర్వాత మీకు ఇంకేవీ గుర్తుకురావు. కేవలం ఇల్లు మరియు రాజధాని గుర్తుకువస్తాయి. అప్పుడిక ఈ ఉద్యోగాలు మొదలైనవేవీ గుర్తుకురావు. కూర్చుని-కూర్చునే అకస్మాత్తుగా హార్ట్ ఫెయిల్ అయినట్లుగా మరణిస్తారు. దుఃఖము యొక్క విషయమే ఉండదు. హాస్పిటళ్ళు మొదలైనవేవీ ఉండవు. తండ్రిని తెలుసుకున్నాక ఇక స్వర్గాధిపతులుగా అవుతారు. మీకైతే హక్కు ఉంది, అందరికీ హక్కు లేదు ఎందుకంటే స్వర్గములోకి అందరూ అయితే రారు కదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఆత్మిక పండాలుగా అయి అందరికీ ఆత్మిక ఇంటికి దారిని చూపించాలి. జ్ఞానము మరియు యోగము యొక్క అస్త్ర-శస్త్రాలతో మొత్తం విశ్వముపై రాజ్యం చేయాలి. డబుల్ అహింసకులుగా అవ్వాలి.

2. 84 జన్మల ఆల్రౌండ్ పాత్రను అభినయించేవారు ఇప్పుడు ఆల్రౌండర్ గా అవ్వాలి. అన్ని పనులూ చేయాలి. అనంతమైన వెరైటీ డ్రామాలో ప్రతి పాత్రధారి పాత్రను చూస్తూ హర్షితముగా ఉండాలి.

వరదానము:- అవినాశీ ఉల్లాస-ఉత్సాహాల ద్వారా తుఫానును తోఫా (కానుక)గా తయారుచేసే శ్రేష్ఠ బ్రాహ్మణ ఆత్మా భవ

ఉల్లాస-ఉత్సాహాలే బ్రాహ్మణుల ఎగిరే కళకు రెక్కలు. ఈ రెక్కల ద్వారా సదా ఎగురుతూ ఉండండి. ఈ ఉల్లాస-ఉత్సాహాలు బ్రాహ్మణులైన మీ కొరకు అతి పెద్ద శక్తి. మీది నీరసమైన జీవితము కాదు. ఉల్లాస-ఉత్సాహాల రసము సదా ఉంటుంది. ఉల్లాస-ఉత్సాహాలు కష్టాన్ని కూడా సహజము చేసేస్తాయి, వారు ఎప్పుడూ నిరాశపడరు. ఉత్సాహము తుఫానును కూడా తోఫా(కానుక)గా చేసేస్తుంది, ఉత్సాహము ఎటువంటి పరీక్షనైనా లేక సమస్యనైనా మనోరంజనముగా అనుభవం చేయిస్తుంది. ఇటువంటి అవినాశీ ఉల్లాస-ఉత్సాహాలలో ఉండేవారే శ్రేష్ఠమైన బ్రాహ్మణులు.

స్లోగన్:- శాంతి అనే ధూపాన్ని వెలిగించి ఉంచినట్లయితే అశాంతి అనే దుర్వాసన సమాప్తమైపోతుంది.